


# ఎగరటానికి రెక్కలక్కర్లేదు

వి. రాజారాము మోహనరావు

మంటోంది. పడుకుంటే బండి పైమకి మెళువ రాదని బెదురు.

కాలి వేళ్ళ చివర్లలోంచి ఆవిర్లొస్తున్నట్టనిపించింది వెంకటికి. అలాగే వోపికని కూడతీసుకుని ఆకల్తోటి మగతతోటి దెబ్బలాడుతూ కూచున్నాడు.

సిటీకొచ్చి నాలుగురోజులైంది. అంతకు ముందు బతుకు వేరు. తనలాంటి బతుకుల్లో అధ్యాయాలు మారటానికి పెద్ద కారణాలేం అఖ్ఖర్లేదని వెంకటికి మూడేళ్ళ క్రితమే తెలిసొచ్చింది. అందుకని ఊర్లు మార్చటం అన్నా, పనులు మార్చటమన్నా భయం పోయింది.

ఈ సిటీకొచ్చేముందు బతుకు చిన్న పాత హోటల్లో అడ్డమైన చాకిరీ చేసినా తిండికి లోటుండేది కాదు. కాని ఆ చాకిరీకి అంతులేకుండా పోయింది. తెల్లారుజామున నాలిగింటికి పిండి రుబ్బటం దగ్గర్నించి ... రాత్రి హోటలు మూసేసేవరకూ క్షణం ఖాళీ వుండేది కాదు. ఒకవేళ వున్నా అయ్యారు చీమిడిముక్కు పిల్లలు ఒదిలే వాళ్ళు కారు. గజ్జి కురుపుల్తో వొళ్ళంతా నిండిపోయిన వాళ్ళని ఎత్తుకోటం, ఆ బాధ పళ్ళేక వదిలేశాడు ఆ వూరు. వదిలేసి యిక్కడికొచ్చిన మొదటి రెండురోజులు హోటళ్ళలో పనికోసం తిరిగాడు. దొరక లేదు. స్టేషన్ దొరికింది.

అలాగే మరి కాస్సేపు పాత జీవితం ముక్కల్ని గుర్తుతెచ్చుకుంటూ గడిపాడు వెంకటి. అన్నీ అంతంత మాత్రమే. ఉద్యోగం వేరు, చేయించేపని వేరు. అదేమని అడిగే ధైర్యంలేదు. అసంతృప్తిగా వున్న చోటునుంచి పారిపోటం. నా అన్న దిక్కూ మొక్కూలేని వాళ్ళందరిగతీ యింతేలే అని సరిపెట్టుకోటం.

ఇంక నాలుగవుతోంటే నెమ్మదిగా లేచాడు. ఎండ వేడిగానే వుంది. వెంకటికి వొళ్ళు కొంచెం తూలినట్టనిపించింది. పక్క హోటలుకెళ్ళి కడుపునిండా రెండు గ్లాసుల నీళ్ళు పట్టించి స్టేషన్ వేపు నడిచాడు.

ఎర్రచొక్కాల హడావిడి, తలపాగాల కంగారు చూసి బండి వొస్తోందిలా వుంది అనుకున్నాడు వెంకటి. వాళ్ళందరూ ప్లాట్ ఫాంమీదకి వెళ్ళేవరకూ స్తంభం చాటున నిలబడ్డాడు. పోర్టర్లందరూ వెళ్ళిపోయారని నమ్మకం కలిగాక మెయిన్‌గేట్ దగ్గర

కొచ్చాడు. నిక్కరు పైకి లాక్కుని పైన మొలతాడు బిగించాడు.

గుంపుగా వస్తున్నారు జనం గేట్లోంచి... వాళ్ళ నెవర్నీ చూట్టంలేదు. వెంకటి. వాళ్ళ చేతులవేపు చూస్తున్నాడు. చిన్న చిన్న బేగ్‌ల కోసం, పళ్ళ బుట్టల కోసం, బ్రీఫ్ కేసుల కోసం, బెడ్డింగుల కోసం చూస్తున్నాడు. అంతకు మించిన బరువులు మొయ్యలేడు. వెంకటి వేటకి ఫలితం దక్కింది.

ఓ పళ్ళబుట్ట, చిన్న బెడ్డింగ్ దొరికాయి. బేరంకూడా హడావిడే.ఏ ఎర్రచొక్కాలో,ఏ బొడుమీసాలోచూస్తాయని భయం. ముప్పై పైసలకివొప్పుకున్నాడు. గబగబా ముందుకి నడిచాడు. పోర్టికోవరకూ వచ్చాక కొంచెం స్తిమితపడ్డాడు వెంకటి. వెనకాల సామానాయనా నెమ్మదిగా వస్తున్నాడు. ఇంకో పదడుగులైతే స్టేషన్ దాటేస్తాడు.

కానీ పదడుగులూ పడనివ్వలేదు...... ఏ మూల నక్కున్నాడో పెద్ద మీసాలవాడు బాణంలా వచ్చి పట్టుకున్నాడు. ....ఏదేదో అంటున్నాడు. "బద్మాష్....బాడ్ ఖోవ్..." అన్నతిట్లు వినపడ్డాయి. చేతిలో బుట్ట బలవంతంగా లాక్కోటం తెలుస్తోంది వెంకటికి. తనకుతెలియకుండానే గట్టిగా పట్టుకున్నాడుబుట్టని.

చుట్టూ జనం చేరారు. మరో యిద్దరు ముగ్గురు లైసెన్స్ పోర్టర్లు పరిగెత్తుకొచ్చారు.

"ఒదులు బే" అంటూ గట్టిగా ఓ గుంజు గుంజాడు పెద్ద మీసాలాడు. అప్పటికీ వెంకటి వొదలకపోతే లాగిపెట్టి ఓసారి చెయ్యి విసిరాడు. వెంకటి ఒక్కసారే బుట్టా, బెడ్డింగ్ రెండు వదిలేశాడు. కళ్ళ ముందు ఎండ కరిగిపోతూ చీకటై పోయింది.

నిలదొక్కుకుని వెంకటి కళ్ళు తెరిచేటప్పటికి సామానాయన "ఏదో కుర్రాడు ఈసారికి పోనియ్యండి" అంటున్నాడు.

"పోనిస్తే ఎలాగండీ. మేం బతకఖ్ఖర్లే. మా నోటికాడకూడు" అంటున్నాడు వాళ్ళల్లో వొకడు.

"ఎన్నిసార్లు చెప్పాలో. యింటే నా ఎదవ" అన్నాడు పెద్ద మీసాలాడు.

వెంకటికి ఏం మాట్లాడాలనిపించలేదు. నిజానికి వోపికలేదు. ఎలాగేనా ఆ గుంపులోంచి వెళ్ళిపోవా లనిపించింది.

దవడమీద మీసాలాడి మోటుచెయ్యి మంట కొద్దిగా తెలుస్తోంది. చుట్టూవున్న కొన్ని వందలమంది తనని జంతువుని చూస్తున్నట్టు చూస్తున్నా రనిపించింది. అప్పుడప్పుడే సిగ్గూ, అభిమానం తెలుస్తూన్న పదమూడేళ్ళ వెంకటికి తను ఆ క్షణంలో చచ్చిపోయినా బాగుణ్ణనిపించింది. అతికష్టంమీద కళ్ళల్లో నీళ్ళు బైటికి రాకుండా ఆపుకున్నాడు.

మరో పావుగంట రభస తర్వాత గట్టి వార్నింగిచ్చిగాని వెంకటిని వొదల్లేదు మీసాలాడు. కాళ్ళీడ్చుకుంటూ నెమ్మదిగా దవడ రాసుకుంటూ అరుగు దగ్గర కొచ్చి కూలబడ్డాడు వెంకటి.

* * *

రెండోరోజు సాయంత్రం స్టేషన్ ఎదురుగా సరిగ్గా అదే అరుగు దగ్గర తన చుట్టూ గుంపుగా చేరిన జనాన్ని చూసి వెంకటిసిగ్గు పడలేదు అభిమాన పడలేదు.

వాళ్ళందర్నీ చూసి కులుకుతూ నవ్వాడు కూచునే తన చేతుల్లోని చిరతల్ని డాన్స్ చేయించాడు. పక్కనే చిరతల జోరుని తినేస్తూ గుడ్డి నర్సిగాడు సినిమా పాటలు దంచేస్తున్నాడు. నర్సిగాడు వెంకటికన్నా చిన్నాడు. చిన్నాడు అంత చక్కగా పాడుతుంటే ముదుగా వుందో, వింతగా వుందో జనానికి తెగ మూగారు. మధ్యమధ్యలో వెంకటి నర్సిగాడికి ఉషారిస్తున్నాడు. తమముందు గుడ్డమీద రాలున్న డబ్బుల్ని చూసి నవ్వుతున్నాడు. ఆ నవ్వులో గర్వం వుంది. వచ్చిన సంపాదనెంతో గుడ్డాడు చూళ్ళేడన్న ధైర్యం వుంది. ఈ లోకంలో పరాయివాడి కష్టంమీద నేర్పుమీద తెలివిగా బతికేయచ్చన్న ధీమా వుంది. వాటితోపాటు కష్టపడి పనిచేసి తన రెక్కల కష్టంమీద బతుకుదామన్న పదమూడేళ్ళ భారతీయ పౌరుడి చచ్చిపోయిన కుతూహలం కూడా వుంది.

గుంపులు పలచబడ్డాక చిరతల జోరు తగ్గించాడు వెంకటి. గుంపంతా కదిలిపోయాక మిగిలిన అయిదారుగురిలోఎల్లమ్మ కూడా వుంది. వెంకటిని చూసి నవ్వింది... సరిగ్గా యిదివరకులాగే ఈసారి వెంకటి చిరాకుపళ్ళేదు. బదులుగా తనూ నవ్వాడు.

★

డబ్బు కావాలా ?

రు. 6/-లు పెట్టుబడితో మా (చైను పద్ధతి) స్కీములో సభ్యులుగాచేరి మీ బంధు మిత్రులను చేర్పించడం ద్వారా ఇంట్లో కూర్చుని ప్రతిరోజూ మనియార్డర్ల ద్వారా రు. 17,476/-లు. లాభం పొందండి.

వివరములు ఉచితము.

Sree Venkateswara Money
CirculationGovtRegdNo.210
GUINDY- MADRAS-32

## అభిప్రాయవేదిక

(3వ పేజీ తరువాయి)

శ్రీ బాపూగారి వర్ణ ముఖ పత్రముతో దివ్య దీపావళి ప్రత్యేక సంచిక "ఆంధ్రజ్యోతి" నయానందకరంగా విరాజిల్లినది.శ్రీ యర్రంశెట్టి శాయిగారి "ప్రేమకు పుల్‌స్టాప్ వుందా?" హాస్య నవల కడుపుపుబ్బ నవ్వించినది. ఈ సంచిక ప్రతి పఠిత మనమున నిరంతరము ఆనందజ్యోతులు వెలిగిస్తుందని నాయొక్క ప్రగాఢ ఆకాంక్ష.

లతీఫొద్దీన్ అహమదీ, సుల్తానాబాద్

15-11-74 "ఆంధ్రజ్యోతి" చూశాక ఈ ఉత్తరం రాయకుండా వుండలేకపోయాను. ఆ సంచికలో ప్రచురింపబడిన శ్రీ కృష్ణమోహనరావుగారి రచన "కోర్టువారి సమక్షంలో" చదువుతుంటే నాలుగు నెలల్రకితం సాధన సమితి మీటింగ్‌లో అదే రచన చదువుతున్న శ్రీ కృష్ణ మోహనరావుగారి రూపం కళ్ళకి కట్టినట్లుగావుంది. ఆనాడు మాతోబాటు నవ్విన జానకీరాణిగారు ఇప్పుడెలా వున్నారో? ఏమిటో ఇలాటి వాక్యాలైతే అందరం రాయగలంకాని, పోయిన మనిషిని మళ్ళీ తీసుకురాలేంకదా!

కొంపెల్ల విశ్వం, హైదరాబాదు

ఆంధ్రజ్యోతి
సచిత్ర వార పత్రిక

17-1-75

ఆనంద సంక్రాంతి
ప్రత్యేక సంచిక

ఎక్కువ పేజీలతో
విశేష ఆకర్షణలతో
తెలుగు రచయిత్రుల
అభినందన సంచికగా
వెలువడుతుంది.